మద్యం దుకాణాల కోసం సిండికేట్



భోగాపురం ఎక్సైజ్ స్టేషన్ వద్ద దరఖాస్తులు స్వీకరించే పనిలో ఎక్సైజ్ అధికారులు

- విజయదశమి నుంచి కొత్త దుకాణాలు
- 26 దుకాణాలకు ఇప్పటికే 300 దరఖాస్తులు

పూసపాటిరేగ: విజయదశమి నుంచి కూటమి ప్రభుత్వం తీసుకురానున్న నూతన మద్యం పాలసీ ద్వారా కొత్త మద్యం షాపులు ఏర్పాటు కానున్నాయి. ఓ వైపు భారీగా దరఖాస్తు ఫీజులను పెంచడంతో కూటమి నాయకులు గ్రామాలలో రింగ్‌గా ఏర్పడి కొన్ని దరఖాస్తులు మాత్రమే షాపులకు వేయడానికి సమాలోచనలు చేస్తున్నట్లు సమాచారం. ఈ నెల 12 నుంచి నెల్లిమర్ల నియోజకవర్గంలో 26 మద్యం షాపులు ఏర్పాటు కానున్నాయి. ఇప్పటి వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో 300 దరఖాస్తులు వచ్చాయి. ఈ నెల 9వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు మద్యం షాపులకు దరఖాస్తులు చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. 11న మద్యం షాపులు ఎంపికకు లాటరీ తీయనున్నారు. గతంలో మద్యం షాపులలో ఆరితేరిన వ్యాపారులు, కూటమి నాయకులు అధిక సంఖ్యలో సిండికేట్‌గా మారి ఒప్పందం చేసుకోవడానికి ఆలోచనలో చేస్తున్నట్టు చర్చ జరుగుతోంది. దరఖాస్తు గడువు ఒక్క రోజే వుండటంతో చివరి రోజున భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశం వుందని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. టెండర్లలో ఎలాగైనా షాపులు దక్కించుకొని, మద్యం వ్యాపారంలో లాభాలు సాధించుకోవాలనే ఆశతో ప్రజా ప్రతినిధులు మద్యం షాపుపై దృష్టి సారించారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా భారీగా లైసెన్సు ఫీజు పెంచడంతో రింగ్‌గా ఏర్పడి దరఖాస్తు చేయడానికి అధిక సంఖ్యలో మొగ్గు చూపుతున్నారు. లాటరీలో అదృష్టం వరించి షాపు దక్కినట్లయితే ప్రభుత్వం విధించిన షరుతులతో లైసెన్సు ఫీజు కట్టి వ్యాపారాలు చేసినా లాభం వస్తుందో లేదో అనే అయోమయంలో కూడా కొంతమంది ఉన్నారు.

నెల్లిమర్ల నియోజకవర్గంలో ఏర్పాటు కానున్న మద్యం దుకాణాలు

మండలం	దుకాణాలు
పూసపాటిరేగ	9
భోగాపురం	7
డెంకాడ	5
నెల్లిమర్ల	5

కూటమి ప్రభుత్వంలో ఆడబిడ్డలకు రక్షణ కరువు

నెల్లిమర్ల రూరల్: కూటమి ప్రభుత్వంలో ఆడబిడ్డల మాన ప్రాణాలకు రక్షణ కరువైందని జై భీమ్‌రావు భారత్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టొంపల నరసయ్య, ప్రధాన కార్యదర్శి కనిగిరి శ్రీను అన్నారు. మండలంలోని సతివాడలో మంగళవారం మాట్లాడుతూ.. కాకినాడ జిల్లా పిఠాపురంలో దళిత బాలికపై టీడీపీ నాయకుడు అత్యాచారం చేయడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆడబిడ్డల వరుస హత్యలు, అత్యాచారాలు పెరిగిపోయాయన్నారు. ఉప ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలోనే ఇటువంటి అమానుష ఘటన జరగడం బాధాకరమన్నారు. మంచి ప్రభుత్వమని చెప్పుకు తిరుగుతున్న కూటమి నాయకులకు ఇలాంటి ఘటనలు కనిపించకపోవడం సిగ్గు చేటు అని విమర్శించారు. గత ప్రభుత్వం 29 వేల మంది అమ్మాయిలు మిస్ అయ్యారని గొంతు చించుకొని ప్రసంగాలు అందించి గద్దెనెక్కిన పవన్ కళ్యాణ్ ఎంత మందిని కాపాడారో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. అధికారం చేపట్టిన కొద్ది రోజుల్లోనే దళితలు, ఆదివాసీలు, చిన్నారులపై దాడులు జరుగుతున్నాయని, రక్షణ చర్యలు చేపట్టకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత బాలికపై హత్యాచారానికి ఒడిగట్టిన టీడీపీ నాయకుడిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వరి పంటకు తెగుళ్లు



అమకాంలో వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ, తదితరులు

డెంకాడ: వరి పంటకు ఆకుముడత, పాము పొడ తెగులు ఆశిస్తుందని, రైతులు తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి పూడి నిర్మల సూచించారు. మండలంలోని అమకాం, చింతలవలస రైతు సేవా కేంద్రాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. దీనిలో భాగంగా రైతులతో కలిసి అధికారులు వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ వరి పంట చిరుపొట్ట దశలో ఉందని, అందువలన ఎకరాకు 20 కేజీల యూ రియా, 25 కేజీల పొటాష్ ఎరువులను వేయాలన్నారు. వరి పంటకు ఆకుముడత, పాముపొడ తెగులు ఆశించిందన్నారు. వీటి నివారణకు కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్పీ శాతం 500 గ్రాములు, లేదా ప్రొఫినోఫాస్ 50 శాతం ఎస్సీ 500 ఎంఎల్ మందును హెక్సాకోనజోల్ లేదా వాలిడామైసిన్ 500 ఎంఎల్‌తో కలిసి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్ము నాయుడు, ఏఈఓ ప్రశాంతి పాల్గొన్నారు.

కొబ్బరి రైతుల సమస్యల పరిష్కారానికి కృషి



కరపత్రాలు విడుదల చేస్తున్న రైతు సంఘం నాయకులు

పూసపాటిరేగ: తీర ప్రాంతంలో కొబ్బరి రైతులు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు కోకోనట్ కోయర్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కార్యదర్శి మొంగం శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని చింతపల్లి గ్రామంలో కోకోనట్ బోర్డు ఆధ్వర్యంలో కరపత్రాలను మంగళశారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో ఏర్పాటు చేయబోయే సదస్సులో కొబ్బరి రైతులకు కావాల్సిన మౌలిక సదుపాయాలపై చర్చించనున్నామని తెలిపారు. ఆయన వెంట రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

దాడులు అమానుషం

నెల్లిమర్ల: పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలని సీపీఎం, సీపీఐ, సీపీఎం ఎంఎల్ నాయకులు కిల్లంపల్లి రామారావు, మొయిద పాపారావు, కాళ్ల అప్పలసూరి డిమాండ్ చేశారు. స్థానిక మొయిద జంక్షన్‌లో వామపక్షాల ఆధ్వర్యంలో ఇజ్రాయిల్ దాడులకు వ్యతిరేకంగా మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇజ్రాయిల్ సంవత్సర కాలంగా పాలస్తీనాపై జరిపిన దాడులు జరిపి 85 వేల మంది పాలస్తీనా పౌరులను చంపడం దుర్మార్గమన్నారు. అలాగే ఇజ్రాయిల్ పాలస్తీనా భూభాగాలు, పాఠశాలలు, మసీదులపై వైమానిక దాడులతో వేలాది మందిని పొట్టన పెట్టుకున్నారన్నారు. ఇజ్రాయిల్‌కు అమెరికా ఆయుధాలు సరఫరా చేసి యుద్ధాలకు కారణం అవుతుందన్నారు. ఐక్యరాజ్య సమితి కలుగజేసుకొని శాంతిని నెలకొల్పి యుద్ధ నివారణ చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురి వామపక్ష నాయకులు పాల్గొన్నారు.

16న మండల సమావేశం

డెంకాడ: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 16న జరుగుతుందని ఎంపీడీఓ వై.భవాని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగే సమావేశానికి సభ్యులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

నేటి నుంచి పంచాయతీ పాలనపై శిక్షణ

డెంకాడ: మండలంలోని అన్ని పంచాయతీలకు చెందిన ఉప సర్పంచ్‌లు, ఇద్దరు వార్డు సభ్యులకు ఈ నెల 9, 10 తేదీల్లో వెలుగు కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ వై.భవాని మంగళవారం తెలిపారు. గ్రామ పంచాయతీ కనీస పాలనపై అవగాహన కోసం ప్రతీ గ్రామ పంచాయతీకి చెందిన ఉప సర్పంచ్, ఒక మహిళ, ఒక పురుషుడైన వార్డు మెంబర్లకు అవగాహన కోసం శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. గ్రామ పంచాయతీల్లో సాధారణ కనీస పాలనా విధానం ఏపీపీఆర్ చట్టం 1994 సంబంధించి నిబంధనలు, 10 అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు.

నేటితో ఈకేవైసీ గడువు పూర్తి



బొప్పడాంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ పూర్ణిమ

నెల్లిమర్ల రూరల్: రైతు సేవా కేంద్రాల్లో రైతులంతా ఈకేవైసీ ప్రక్రియను బుధవారంలోగా పూర్తి చేసుకోవాలని ఏఓ పూర్ణిమ సూచించారు. మండలంలోని బొప్పడాం, వల్లూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామ సభలో ఏఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ వ్యవసాయ పథకాలకు అర్హత పొందాలంటే ఈకేవైసీ తప్పనిసరి అన్నారు. మండల వ్యాప్తంగా అన్ని రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉంటారని, రైతులు తమ పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. వరిలో యాజమాన్య పద్ధతులను అవలంబించాలని, పురుగు తెగుళ్ల నివారణపై శ్రద్ధ పెట్టాలన్నారు. ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించి సేంద్రీయ సాగుపై అన్నదాతలు దృష్టి సారించాలని కోరారు. తద్వారా నేల సారవంతంతో పాటు మంచి దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బొంతు పురుషోత్తం, గ్రామ పెద్దలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి సన్నిధిలో ప్రత్యేక అర్చనలు



స్వామి సన్నిధిలో పూజలు నిర్వహిస్తున్న అర్చకస్వాములు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో మంగళవారం సందర్భంగా ఆంజనేయస్వామి సన్నిధిలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున స్వామి ప్రాతః కాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత ఆంజనేయస్వామికి పాలు, పెరుగు, తేనె, పెరుగు, నెయ్యి, వివిధ రకాల ఫల రసాలతో అభిషేకాలు జరిపించారు. అనంతరం నూతన వస్త్రాలు, పుష్పాలతో స్వామిని సుందరంగా అలంకరించి తమలపాకులు, సింధూరంతో విశేష అర్చనలు ని ర్వహించారు. అనంతరం హనుమాన్ చాలీసా పఠించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

వ్యాపారస్తులకు ట్రేడ్ లైసెన్స్‌లు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రజారోగ్యాధికారి సాంబమూర్తి

విజయనగరం: విజయనగరం నగర పరిధిలో ఉన్న ప్రతి వ్యాపారస్తుడు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండాలని ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి అన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన ట్రేడ్ లైసెన్స్‌పై అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయనకు చాంబర్ ప్రతినిధులు స్వాగతం పలికి జ్ఞాపకతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రజారోగ్య అధికారి డాక్టర్ సాంబమూర్తి మాట్లాడుతూ విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య ఆదేశాల మేరకు వ్యాపారస్తులకు ట్రేడ్ లైసెన్స్‌పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఏ వ్యాపారానికైనా ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి అన్నారు. ప్రభుత్వ నిబంధన మేరకు ట్రేడ్ లైసెన్సులు పొందిన తర్వాతనే వ్యాపారాలు సాగించాలన్నారు. ఇది వరకే ట్రేడ్ లైసెన్సులు కలిగి ఉన్నట్లయితే తప్పనిసరిగా రెన్యువల్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చాంబర్ ప్రతినిధులు రవ్వ శ్రీనివాసరావు, కాపుగంటి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు శిక్షణ

విజయనగరం రూరల్: ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఉన్న సమావేశ మందిరంలో గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా పంచాయతీ పరిధిలో ఉన్న ఉప సర్పంచులు, వార్డు మెంబర్లకు రెండు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్టు ఎంపీడీఓ చంద్రకళ మంగళవారం తెలిపారు. శిక్షణలో పంచాయతీ విధులు, బాధ్యతలు, అధికారాలు, పంచాయతీల అభివృద్ధిపై పూర్తి స్థాయి శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. మండలంలో ఉన్న 22 గ్రామ పంచాయతీల ప్రజాప్రతినిధులు శిక్షణలో పాల్గొనాలని కోరారు.

రూ.1.20 కోట్లతో పైడితల్లి జాతర ఏర్పాట్లు

- కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య



ప్రధానరోడ్ల మధ్య ఉన్న డివైడర్‌లను సుందరీకరిస్తున్న దృశ్యం

విజయనగరం: పైడితల్లమ్మ సిరిమాను జాతర మహోత్సవం ఈ నెల 15న జరగనున్న నేపథ్యంలో విజయనగరం నగరపాలక సంస్థ తరఫున అన్ని సదుపాయాలను యుద్ధ ప్రాతిపదికను కల్పిస్తున్నట్లు కమిషనర్ పి.నల్లనయ్య మంగళవారం తెలిపారు. కోటి 20 లక్షల రూపాయలతో బీటీ రోడ్డు, వివిధ రహదారుల మరమ్మతు పనులు, డివైడర్లకు ఉన్న రైలింగులకు రంగులు, వివిధ జంక్షన్లలో విద్యుదీకరణ, అలాగే ప్రాశస్త్య భవనాలకు విద్యుదీకరణ వంటి ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే పుత్సల వీధిలో బీటీ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేశామని తెలిపారు. హుకుంపేటలోని పూజారి ఇంటి నుండి సిరిమాను చదురు గుడి వరకు తరలి వస్తుందని ఇదే సమయంలో సిరిమాను ఆగమనానికి ఎక్కడ ఆటంకం లేకుండా రహదారులను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. నగరంలో జాతర జరిగే రెండు రోజులు నిరాటంకంగా మంచినీటి సరఫరా చేస్తామని తెలిపారు. కుళాయిలు లేని ప్రాంతాలలో ట్యాంకర్ల ద్వారా మంచినీటి పంపిణీ జరుపుతామన్నారు. నగరంలోని అన్ని ప్రాంతాలలో వీధిలైట్లు పునరుద్ధరించామని అన్ని వీధి లైట్లు వెలిగే విధంగా చూస్తామని చెప్పారు. పారిశుద్ధ్య పరంగా ప్రత్యేక పని వారలను నియమించినట్లు చెప్పారు. 430 మంది అదనపు పారిశుద్ధ్య కార్మికులను సిరిమాను సందర్భంగా నియమించామన్నారు. ప్రతి వీధిలో కాలువల పూడికతీత పనులను చేపట్టామని తెలిపారు. అమ్మవారి చల్లదనాలు చేపడుతున్న ప్రాంతాలలో పారిశుద్ధ్య పరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు కూడా చైతన్యవంతులై రహదారులను, వీధులను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎక్కడ పడితే అక్కడ చెత్తాచెదారాలను వేయరాదని కోరారు. ప్రసాదాల పంపిణీ సమయంలో కచ్చితంగా పేపర్ ప్లేట్లుగాని, విస్తరాకుల ప్లేట్లుగాని వినియోగించాలని సూచించారు. ఎక్కడా ప్లాస్టిక్ వినియోగానికి తావు లేదని తెలిపారు. ఇందుకోసం ఇప్పటికే అవగాహన కల్పించామని అయినప్పటికీ ప్లాస్టిక్ వినియోగాన్ని జరిపినట్లు గుర్తిస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నగరంలో గోడ రాతలు ఉండరాదని తెలిపారు. అనుమతి లేనిదే పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయరాదన్నారు. అందరి సహకారంతో పైడితల్లమ్మ జాతరను ఆనందోత్సాహాలు నడుమ నిర్వహించుకుందామని తెలిపారు.

పైడితల్లి జాతర ఏర్పాట్లపై సూచనలివ్వండి : ఎంపీ

విజయనగరం: ఈ నెల 13, 14, 15 తేదీల్లో నిర్వహించే విజయనగరం ప్రజల ఇలవేల్పు పైడితల్లమ్మవారి జాతర ఏర్పాట్లుకు సంబంధించి భక్తులు తమ సూచనలు, సలహాలు అందజేయాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కోరారు. బుధవారం సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించటం జరుగుతుందని పేర్కొన్నారు. సలహాలు ఇవ్వదలిచిన భక్తులు 94404 36426, 89190 60911, 98499 06486 నంబర్లకు డయల్ చేసి తమ అమూల్యమైన సలహాలను అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, జిల్లా రెవెన్యూ అధికారి, దేవదాయ శాఖ అధికారులతో పాటు ఇతర అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. సిరిమాను ఊరేగింపు, ట్రాఫిక్ నియంత్రణ, భక్తులకు సౌకర్యాల కల్పన, భద్రతా సౌకర్యాలు తదితర అంశాలపై సలహాలు అందించవచ్చని సూచించారు.


కమిషనర్‌గా మద్దతుగా కార్పొరేషన్ ఉద్యోగులు



సచివాలయం కార్యదర్శుల తీరుకు వ్యతిరేకంగా నిరసన తెలియజేస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

విజయనగరం: కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య నగరంలోని సచివాలయ కార్యదర్శులతో దురుసుగా వ్యవహరిస్తున్నారని జరుగుతున్న ప్రచారం వాస్తవ విరుద్ధమని కార్పొరేషన్ కార్యాలయ ఉద్యోగులు తెలిపారు. నగరంలో విధులు నిర్వహిస్తున్న సచివాలయ కార్యదర్శులు కమిషనర్‌పై దుష్ప్రచారం చేయటాన్ని వారు ఖండించారు. ఈ మేరకు మంగళవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. విధి నిర్వహణలో అధికారులు కఠినంగా వ్యవహరించినపుడే లక్ష్య సాధన సాధ్యపడుతుందని పేర్కొన్నారు. ఇటీవల కార్యాలయంలో జరిగిన సమావేశంలో అనారోగ్యంతో అస్వస్థతకు గురైన పరిపాలన కార్యదర్శిని కమిషనర్ ఆదేశాలతో నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించటం జరిగిందని తెలిపారు. ఈ విషయంలో వాస్తవాలకు భిన్నంగా వ్యవహరిస్తున్న సచివాలయ కార్యదర్శుల తీరును ఖండిస్తున్నామని, నగర అభివృద్ధికి కృషి చేస్తున్న ఆయనకే తమ పూర్తి మద్దతు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. నిరసనలో కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరావు, సీనియర్ అసిస్టెంట్‌లు అప్పలరాజు, వినోద్, కిరణ్ ఇతర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వైమానిక దళ దినోత్సవం



విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న ప్రిన్సిపాల్ శర్మ

విజయనగరం రూరల్: ఇండో - పాక్ యుద్ధంలో 1971లో దేశాన్ని రక్షించడానికి తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అర్పించిన వైమానిక దళానికి చెందిన ఏకైక పరమవీర చక్ర దివంగత ఫ్లయింగ్ అధికారి నిర్మల్ జిత్ సింగ్‌ను ప్రతీ ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్‌శాస్త్రి అన్నారు. పాఠశాలలోని వైమానిక దళ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థుల నడుమ మంగళవారం కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫ్లయింగ్ అధికారి యొక్క ధైర్యసాహసాలు, త్యాగం మనలో ప్రతీ ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అనంతరం ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన కోర్సులను విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బందితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన హెవీ డ్రైవింగ్ శిక్షణ



ధ్రువపత్రాలతో శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులు

విజయనగరం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ విజయనగరం డ్రైవింగ్ స్కూల్ ఆధ్వర్యంలో హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ కళాశాలలో 18వ బ్యాచ్ అభ్యర్థులకు నిర్వహించిన హెవీ డ్రైవింగ్ శిక్షణ మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన ముగింపు కార్యక్రమానికి జిల్లా ప్రజా రవాణా అధికారి సిహెచ్.అప్పలనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకుని వెళ్తున్న అభ్యర్థులు భవిష్యత్తులో మంచి డ్రైవర్లగా గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. అనంతరం వారికి సర్టిఫికెట్లు అందజేశారు. విజయనగరం డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు మాట్లాడుతూ మరో వారం రోజుల్లో 19వ బ్యాచ్ నూతన బ్యాచ్ ప్రారంభవుతుందని డిపో మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. లైట్ వెహికల్ లైసెన్స్ ఒక సంవత్సరం అనుభవం కలిగి 21 సంవత్సరాలు నిండిన వారు ఈ వెహికల్ లైసెన్స్ డ్రైవింగ్ ట్రైనింగ్‌కు అర్హులని వివరించారు. మొత్తం శిక్షణ 40 రోజుల పాటు వుంటుందని ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు డ్రైవింగ్ స్కూల్ ఇన్‌స్పెక్టర్ డీఎస్ రాజు 73829 24030, 98666 49336 నంబర్లనుసంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

పసుపుకొమ్ముల అలంకరణలో దుర్గమ్మ



పసుపుకొమ్ముల అలంకరణలో దుర్గాదేవి

విజయనగరం టౌన్: స్థానిక గాజులరేగ సాలి వీధి మెయిన్‌రోడ్డులో దుర్గాదేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆరో రోజు అమ్మవారు శ్రీ లలితాత్రిపుర సుందరీ దేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ప్రత్యేకంగా పసుపు కొమ్ములతో సర్వాంగ సుందరంగా అలంకరణ చేశారు. ప్రదీప్ శర్మ నేతృత్వంలో అమ్మవారికి లక్ష కుంకుమార్చనలు చేశారు. మహిళలు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించి, తరించారు.

వనంగుడిలో..



విజయనగరం టౌన్: శ్రీమహాలక్ష్మి దేవి అలంకరణలో దుర్గాదేవి

విజయనగరం టౌన్: శ్రీ పైడితల్లి అమ్మవారి వనంగుడిలో కొలువైన దుర్గాదేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీమహాలక్ష్మీదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు నేతేటి ప్రశాంత్, వేదపండితులు వెలువలపల్లి నరసింహాచార్యులు, సాయిలు శాస్త్రోక్తంగా శ్రీ చక్రకుంకుమార్చనలను నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మొక్కుల చెల్లింపు



పూడమ్మతల్లి వనం వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

నెల్లిమర్ల: నెల్లిమర్ల గ్రామ దేవత శ్రీ పూడమ్మ తల్లి వారాలు సందర్భంగా మంగళవారం వేలాది మంది భక్తులు చదురుగుడి, పూడమ్మ తల్లి వనం వద్ద మొక్కులు చెల్లించుకున్నారు. వేకువజామున ఐదు గంటల నుండి దర్శనం చేసుకున్నారు. అమ్మవారికి చీరలు, పసుపు కుంకుమలు సమర్పించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. పూజా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయం జోష్ నింపింది


- డీసీసీ అధ్యక్షుడు విద్యాసాగర్



సమావేశంలో మాట్లాడుతున్న విద్యాసాగర్

విజయనగరం ఫోర్ట్: జమ్మూకశ్మీర్‌లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం పార్టీ శ్రేణుల్లో కొత్త జోష్ నింపిందని డీసీసీ అధ్యక్షుడు మరిపి విద్యాసాగర్ అన్నారు. డీసీసీ స్థానిక కార్యాలయంలో విలేకరులతో ఆయన మంగళవారం మాట్లాడారు. హర్యానాలో బీజేపీ మతలబు చేసిందన్నారు. కొన్ని చోట్ల కాంగ్రెస్ పార్టీ ఎలక్షన్ కౌంటింగ్ ఏజెంట్స్‌ను కౌంటింగ్ కేంద్రం నుంచి బలవంతంగా బయటకు పంపించడాన్ని ఖండిస్తున్నామన్నారు. పార్టీ నాయకులు గేదెల తిరుపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా జాతీయ తపాలా వారోత్సవాలు



క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో తపాలా శాఖ సూపరింటెండెంట్ శ్రీనివాస్

విజయనగరం టౌన్: జాతీయ తపాలా వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం జిల్లా ప్రధాన తపాలా కార్యాలయంలో విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టల్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ నెల 11 వరకూ తపాలా వారోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.